# సెల్ ఫోన్లను సీఈఐఆర్ ద్వారా గుర్తించి బాధితులకు అందజేత

## -సీపీ అనురాధ



బాధితులకు సెల్ ఫోన్లు అందిస్తున్న సీపీ డా॥ అనురాధ

**సిద్దిపేట అర్బన్, మే 4, ప్రభాతవార్త :** గత కొన్ని రోజుల నుంచి పడిపోయిన, దొంగలించబడిన 65 సెల్ ఫోన్లను రికవరీ చేసి సంబంధిత బాధితులకు శనివారం సీపీ కార్యాలయంలో సీపీ డా॥అనురాధ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సీపీ డా॥అనురాధ మాట్లాడుతూ సెల్‌ఫోన్ ఎక్కడైనా పడిపోయిన, ఎవ్వరైనా దొంగలించకపోయినా వెంటనే సీఈఐఆర్ డాటా నమోదు చేయడంతో ఫోన్ రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. గత సంవత్సరం నుంచి 660 సెల్ ఫోన్లు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించడం జరిగిందన్నారు. ఫోన్ దొంగతనం జరిగిన పడిపోయినా వెంటనే పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలో సీఈఐఆర్ పోర్టల్ 2210 మంది సెల్‌ఫోన్ పోయినట్లు నమోదు చేసుకోగా అందులో నుంచి 660 సెల్ ఫోన్లు రికవరీ చేసి సంబంధిత బాధితులకు అప్పగించామని మిగితా ఫోన్లు కూడా త్వరలో ట్రెస్ ఔట్ చేసి సంబంధిత బాధితులకు అప్పగించడం జరిగిందన్నారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ వెబ్‌సెట్‌లో పూర్తి వివరాలు నమోదు చేస్తే వీలైనంత తొందరగా దొరికే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. సీఈఐఆర్ వెబెసెట్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, పోలీసు అధికారులు కిరణ్, నరేందర్‌రెడ్డి, స్వప్న, శ్రీకాంత్, రమేష్ తదితరులు ఉన్నారు.




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


# వడ దెబ్బతో ఉపాధ్యాయుడి మృతి

**హుస్నాబాద్,మే4,ప్రభాతవార్త**

వడదెబ్బతో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన హుస్నాబాద్ మండలం బల్లునాయక్‌తండాలో తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళ్తే బల్లునాయక్‌తండాకు చెందిన లకావత్ రామన్ననాయక్ (ఎస్‌జిటి)గా యాటకార్లపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించేవాడు. ఇదిలా ఉండగా పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా గజ్వేల్ ట్రేయినింగ్ కోసం శుక్రవారం వెళ్లిన సందర్భంలో వడ దెబ్బ తగలడంతో వాంతులు విరోచనాలు కావడంతో అధికారులు రామన్ననాయక్‌ను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతన్ని శుక్రవారం రాత్రి ఇంటికి తీసుకువచ్చారని, అర్ధరాత్రి మళ్లీ వాంతులు విరోచనాలు కావడంతో తిరగి వరంగల్‌లోని ఎమ్‌జిఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతునికి భార్య లక్ష్మి ఒక కూతురు, కుమారుడు ఉన్నట్లు మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు లకావత్ మానససుభాష్‌లు తెలిపారు.

# సిబ్బంది విధులు అత్యంత పారదర్శకతతో నిర్వహించాలి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా శనివారం జిల్లాలోని గజ్వేల్, సిద్దిపేట నియోజకవర్గాలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు సమీర్ మాధవ్‌లు పర్యటించారు. గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలోని సమీకృత కార్యాలయంలోని ఏ బ్లాక్‌లో నిర్వహిస్తున్న ఈవీఎ కమీషనింగ్ ప్రక్రియ, సిద్దిపేట నియోజకవర్గ పొన్నాల శివారులో గల ఇందూరు కళాశాలలోని డి-బ్లాక్‌లో నిర్వహిస్తున్న ఈవీఎ మీషన్ల కమీషనింగ్ ప్రక్రియను వారు పరిశీలించారు. ఎలక్షన్ కమీషన్ అఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం కమీషనింగ్ చేసే సిబ్బంది విధులను అత్యంత పారదర్శకతతో నిర్వహించాలని అదేశించారు. ఈవీఎం మీషన్ల కమీషనింగ్ ప్రక్రియ పూర్తి కాగానే సీల్ చేయడం, కంట్రోల్ యూనిట్‌లను అనుసంధానం చేసి పూర్తి స్థాయిలో చెక్ చేసి సీల్ చేయాలన్నారు. ఈవీఎల డిస్ట్రిబ్యూషన్ చేసే ప్రక్రియ అయా నియోజకవర్గ ఎఆర్‌ఓలకు సూచనలు చేశారు. పిఓ, ఎపిఓలకు ఈవీఎం మీషన్లు డిస్ట్రిబ్యూషన్ రోజు వారి ఎలక్షన్ ప్రక్రియ ఈవీఎం మిషన్ అనుసంధానం, మాక్ పోల్ ప్రక్రియ ఎలక్షన్‌లో ప్రతి ప్రక్రియకు సబంధించిన సర్టిఫికెట్లను నింపే విధానం ఇతరత్రా పూర్తి ప్ర క్రియపై తెలిపాలని సూచించారు. వారి వెంట సిద్దిపేట, గజ్వేల్ ఎఆర్‌ఓలు బన్సీలాల్, సదానందం ఉన్నారు.



ఈవీఎ మీషన్ల కమీషనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, పరిశీలకులు

# హామీలను అమలు చేస్తున్నాం..అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**-రూ.89 కోట్లతో వంతెన**

**-40 కోట్లతో టూరిజం**

**-కాంగ్రెస్ కార్యకర్తలతో మంత్రి దామోదర్ రాజనర్సింహా**

**చౌటకూరు, మే 4, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పార్టీ 6గ్యారంటీలను, వాగ్దానాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా అన్నారు. శనివారం చౌటకూరులో మండల పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇపాటికే 5వందల కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలకు శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసాక పుల్కల్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకున్నామన్నారు. పుల్కల్ నుంచి సదాశివపేట మధ్యలో 89 కోట్ల రూపాయలత వంతెన నిర్మాణం, సింగూరు ప్రాజెక్టు వ్ద 40 కోట్లతో టూరిజం ఏర్పాటు, 190 కోట్లతో కెనాల్ కాల్వల సిసి నిర్మాణాలు, తాడ్దాన్పల్లి పుల్కల్ మధ్యలో రెండు పారిశ్రామిక కంపెనీలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ జాతీయ స్థాయిలో ఇచ్చిన 5 గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని, జహీరాబాద్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి సరేష్‌కుమార్ శెట్కార్‌కు భారీ మెజార్టీతో పార్లమెంట్‌కు పంపేలా ఇంటింట ప్రచారం చేయాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు దుర్గారెడ్డి, నత్తి దశరథ్, ఎంపిటిసి సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు దుర్గయ్య, గోవర్ధన్, లక్ష్మారెడ్డి, అంజయ్య, బోయిని శ్రీనివాస్, ఉదయ్, ఇమ్రాన్, విక్రమ్, శ్రావణ్ కుమార్, మన్నే విఠల్, బోయిన దామోదర్, కోదూరి రవీందర్, వర్కల రమేష్, రామాగౌడ్, రగు, గోరేమియా తదితరులు పాల్గొన్నారు.




కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహా

# కాంగ్రెస్‌లో చేరిన ముదిరాజ్ మహాసభ నాయకులు



మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ముదిరాజ్ మహాసభ నాయకులు

**రామాయంపేట, మే 4, ప్రభాతవార్త ః**

ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల వారు చేరికలతో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. శనివారం నాడు హైదరాబాదులోని ఆయన స్వగృహములో తెలంగాన రాష్ట్ర ముదిరాజ్ మహాసభ మెదక్ జిల్లా శాఖ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారందరకీ ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ ముదిరాజులను ఆదుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ముదిరాజ్ మహాసభ నాయకుడు పుట్టి రాజు మాట్లాడుతూ తనతో పాటు, మండల అధ్యక్షులు, జిల్లా కార్యదర్శులు, పలువురు మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటీసీలు, మహాంకాళీ దేవాలయం డైరెక్టర్ ఆంజనేయులు, పాపన్నపేట ముదిరాజ్ ముఖ్య నాయకులు, మెదక్ పట్టణ, మండల ముఖ్య నాయకులు, రామాయంపేట పట్టణ, మండల ముఖ్య నాయకులు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు.

# మండలంలో ఖాళీ అవుతున్న కారు

**-బిజెపి, కాంగ్రెస్‌లో చేరుతున్న బిఆర్‌ఎస్ నేతలు**

**మనూర్, మే 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారం కోల్పవడంతో నియోజకవర్గంలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఓటమి చెందటంతో మండలంలో బిఆర్‌ఎస్ నాయకులు భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీలోకి చేరుతుండటంతో మండలంలో కారు ఖాళీ అవుతోంది. పార్టీ ముఖ్య నాయకులు ఇతర పార్టీలోకి చేరుతుండటంతో కింది స్థాయి క్యాడర్ అయోమయానికి గురవుతున్నట్లు తెలుస్తోంది. మండలంలో పార్టీని నడిపించే నాయకుడు లేకపోవడంతో పార్టీ మద్దతుతో గెలిచిన ప్రజాప్రతినిధులు సైతం ఇరత పార్టీలో జాయిన్ అవుతుండటంతో కార్యకర్తలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఎంపిపి అధ్యక్షురాలు కొంగరి జయశ్రీ భర్త కొంగరి మోహన్‌రెడ్డి, ఎంపిపి ఉపాధ్యక్షులు రాములు భారతీయ జనతా పార్టీలో చేరగా, సీనియర్ నాయకులు,పుల్‌కుర్తి ఎంపిటిసి భూమయ్య కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. జడ్పీటిసి పుష్పబాయి భర్త, మాజీ ఎంపిపి అధ్యక్షులు మోహన్‌రావు కరోనా కాలంలో వ్యాధికి గురై కానరాని లోకాలకు చేరిపోవడంతో బిఆర్‌ఎస్ పార్టీకి మండలంలో పెద్ద దిక్కులేకుండా పోయిందని చెప్పవచ్చు. ఉమ్మడి మనూర్ మండలంలో కింగ్ మేకర్‌గా ఉన్న మోహన్‌రావు తిరిగిరాని లోకాలకు చేరిపోవడంతో మండలంలో పార్టీ పరిస్థితి రెండు పిల్లులు ఒక కోతి కథలా మారిపోయిందని పార్టీ కార్యకర్తలు దిగులు చెందుతున్నారు. మండలంలో పలువురు బిఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్, బిజెపిలతో టచ్‌లో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

# అమీన్‌పూర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**-ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో భేటీ**

**అమీన్‌పూర్, మే5 ప్రభాతవార్త:**

అమీన్‌పూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళ్తున్న బీఆర్‌ఎస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో ఆదరించి రికార్డు మెజారిటీ అందించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వేదిరి టౌన్‌షిప్, హెచ్‌ఎంటీ కాలనీ, పీజేఆర్ ఎంక్లేవ్, సాయి అంబిక కాలనీ, శ్రీ వాణి నగర్, జన్మభూమి ఫేజ్ 2 తదితర కాలనీల్లో పర్యటించి ఆయా సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గత పది సంవత్సరాలలో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని 9 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అమీన్‌పూర్ మేజర్ గ్రామ పంచాయితీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని తెలిపారు. మున్సిపల్ వ్యాప్తంగా 110 కోట్ల రూపాయలతో 5 రిజర్వాయర్లు నిర్మించి ఇంటింటికీ మంచినీటిని అందించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహాగౌడ్, కౌన్సిలర్లు కృష్ణ, చంద్రకళ గోపాల్, కల్పన ఉపేందర్‌రెడ్డి, బిజిలి రాజు, మహాదేవ్‌రెడ్డి, రాజేశ్వరి, కోఆప్షన్ సభ్యులు తలారి రాములు, సీనియర్ నాయకులు చంద్రశేఖర్, కొల్లూరు యాదగిరి, ఆంజనేయులు, చౌటకూరి మహిపాల్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, బీఆర్‌ఎస్ యువ నాయకులు, తుమ్మల రుశ్వంత్‌రెడ్డి, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

# ప్రపంచ శాంతి కోసం ప్రార్థన చేయండి

**-హజ్ యాత్రికులకు వాక్సినేషన్ పూర్తి**

**-మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్**



హజ్ యాత్రికులను సన్మానిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, మే 4, ప్రభాతవార్త:**

జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళుతున్న ముస్లిం సోదరలు ప్రపంచ దేశాల్లో శాంతి కోసం ప్రత్యేక ఫారూఖ్ హుస్సేన్ కోరారు. హజ్ యాత్రకు వెళ్తున్న జిల్లా వాసులకు రెండో తర్భియత్ శిక్షణ కార్యక్రమం శనివారం పూర్తి చేశారు. ప్రభుత్వం తరపున వాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారూఖ్‌హుస్సేన్ మాట్లాడుతూ ముస్లింలకు అత్యంత పవిత్రమైనది హజ్ యాత్ర అన్నారు. హజ్ యాత్రకు వెళ్లే వారు అదృష్టవంతులని..యాత్రకు వెళ్తున్న యాత్రికులు ప్రపంచ దేశాలలో శాంతి నెలకొనే విధంగా ప్రార్థనలు చేయాలన్నారు. 150 దేశాల నుంచి ముసి ్లంలు హజ్ యాత్రకు సౌదీ అరేబియా వస్తున్నారని సంయమనం పాటించాలన్నారు. అనంతర హజ్ యాత్రికులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హజ్ కమిటీ సభ్యులు ఫక్రుద్దీన్, కరీం జాబేర్ హుసేన్, గౌస్ మోహినొద్దీన్, ఫరీద్, ఉబేద్, అరిఫ్, సాజిద్, మన్సూర్, అక్బర్ నవాబ్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సామగ్రి పంపిణికి ఏర్పాట్లు పూర్తి

## -జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



ఎన్నికల సమాగ్రి పంపిణిని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి

**సంగారెడ్డి టౌన్, మే 4, ప్రభాతవార్త:**

జహీరాబాద్ పార్లమెంట నియోజకవర్గంలోని సంగారెడ్డి జిల్లా పరిధిలోని 5 శాసన సభ నియోజకర్గాలకు సంబంధించిన ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ సామాగ్రి పంపిణి కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి శనివారం పరిశీలించారు. సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పంపిణి కేంద్రంను కలెక్టర్ పరిశీలించిన సందర్భంగా మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడు అంచెల భద్రతా ఏర్పాటు ఉంటుందన్నారు. జహీరాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి రుద్రారం శివారులోని గీతం యూనివర్సిటీలో ఏర్పాటు స్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లి వార్షికోత్సవ ఉత్సవంలో పాల్గొన్న నాయకులు



పెద్దమ్మ దేవాలయానికి లక్ష 16 విరాళం అందిస్తున్న దృశ్యం

**కొండపాక, మే 4, ప్రభాతవార్త:**

కొండపాక మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలో శ్రీ పెద్దమ్మతల్లి పంచమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దమ్మ దేవాలయంలో పెద్దమ్మ అమ్మవారిని గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగారావు, మాజీ సర్పంచ్ మహాదేవ్, మాజీ ఎంపిటిసి బూర్గుల సురేందర్ తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వార్షికోత్సవ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి దేవాలయానికి 100,116 విరాళంగా అందజేశారు.

## మండలంలో విచ్చలవిడిగా ఇసుక మాఫియా



అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లు

**బెజ్జంకి, మే 4, ప్రభాతవార్త :** మండలంలో ఇసుక అక్రమ రవాణా మాఫియా దారులకు కాసుల పంట కురిపిస్తుంది. మండల పరిధిలోని తోటపల్లి గ్రామ శివారులో గల మోయతుమ్మెద వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాదారులు ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి సమయాల్లో ఇసుకను తరలిస్తూ గ్రామ శివారులలో నిర్మానుష్య ప్రదేశాల్లో పదుల సంఖ్యలో నిల్వ చేసి గుట్టుచప్పుడు కాకుండా రాత్రి సమయంలో లారీలు, టిప్పర్ల సహాయంతో పట్టణాలకు తరలిస్తూ అందనకాడికి దండుకుంటున్నారు. ఇంతా జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకునిరేత్తినట్లు వ్యవహరించడంపై సర ్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్రభుత్వ అంక్షలను బేఖాతరు చేస్తూ అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని ఇసుక అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# బీసీలను కాంగ్రెస్ ప్రోత్సహిస్తోంది

**-దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

**రామచంద్రాపురం, మే 4, ప్రభాతవార్త:**

భారత దేశ వ్యాప్తంగా బీసీలను రాహుల్ గాంధీ ప్రోత్సాహిస్తున్నారని, అటవీ, పర్యావరణ, దేవాదయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం రాత్రి తెల్లాపూర్ మున్సిపాలిటీ గద్దర్ ప్రాంగణంలో మ దే సభ, కాంగ్రెస్‌లో చేరికల కార్యక్రమాన్ని మున్సిపాలిటీ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మున్సిపాలిటీ స్వతంత్ర కౌన్సిలర్ కొల్లూరి భరత్ 200 మంది అనుచరులతో మంత్రి కొండా సురేఖ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ బిఆర్‌ఎస్ హయాంలో మాజీ సిఎం కేసిఆర్ రాష్ట్రాన్ని దోచుకునానరని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపి అభ్యర్థి నీలం మధు, డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, పటాన్‌చెరు కో-ఆర్డినేటర్ శ్యామ్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, నాయకులు కొల్లూరి సత్తయ్య, ఎల్ రవీందర్, తూర్పు శ్రీనివాస్‌రెడ్డి, అరుణ్‌గౌడ్, రాజేష్ గౌడ్, గుల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే హరీష్

**కొండపాక, మే 4, ప్రభాతవార్త :**

దుద్దెడ గ్రామంలో పద్దెమ్మ తల్లి అలయ వార్షికోత్సవంలో భాగంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, బిఆర్‌ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి అలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఫర్టిలైజర్ దుకాణాదారులు నిబంధనలు పాటించాలి

**-జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివకుమార్**



ఫర్టిలైజర్ దుఖాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శివకుమార్

**అక్కన్నపేట,మే4,ప్రభాతవార్త**

ఫర్టిలైజర్ దుఖాణాదారులు నిబందనలు పాటించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయశాఖ స్థానిక అధికారులతో కలసి అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువుల సమస్య రాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం దుఖాణాలకు అనుమతులు ఇచ్చిందని, అనుమతులు పొందిన దుఖాణాదారులు ప్రభుత్వం ఆమోదించిన విత్తనాలు, ఎరువులనే వాడాలని సూచించారు. ప్రతీ దుఖాణాదారుడు, డీలర్లు తప్పనిసరిగా ప్రభుత్వ నిబందనలు పాటించాలని సూచించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ విస్థరణ అధికారులు సబిహా, శ్రీలత, శేఖర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్‌డిఓ

**జహీరాబాద్, మే 4, ప్రభాతవార్త:**

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ కేంద్రాన్ని శనివారం ఆర్‌డిఓ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ మాట్లాడుతూ కేంద్రంలో 30 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వార తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల విధుల్లో 1730 ఓటర్లఉ స్థానిక ప్రభుత్వ డిగ్రి కళాశాలలో, 8వ తారీఖ వరకు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. తను సైతం శనివారం ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నట్లు ప్రకటించారు.



డిగ్రి కళాశాలలోని బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఓ రాజు

# రిజర్వేషన్ల రద్దుపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతున్నది

### ఎంపి ఆర్.కృష్ణయ్య

సైఫాబాద్, మే 4 ప్రభాతవార్త: బిజపి రిజర్వేషన్ల వ్యతిరేకి అనే ముద్ర పోవాలంటే బిసిలకు చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని వెంటనే ప్రకటన చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా బిజెపి బిసిల రిజర్వేషన్లకు వ్యతిరేకమని, 400 సీట్లు వస్తే ఎస్సీ, ఎస్టీ, బిసి రిజర్వేషన్‌లు ఎత్తివేస్తారనే చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఇదొక తీవ్రమైన అంశంగా ప్రజలు భావిస్తున్నారని, దేశ ప్రజల్లో బిజెపిపై తీవ్రమైన అనుమానాలు రెకెత్తాయని, రిజర్వేషన్‌ల అంశం సున్నితమైనదని, ఇది ఎస్సీ, ఎస్టీ, బిసి ప్రజల అస్థిత్వానికి సంబంధించినదని ఆయన స్పష్టం చేశారు. తమ పిల్లల భవిష్యత్తుకు అంశంగా దేశ ప్రజలు భావిస్తున్నారని, బిసి, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లు బిజెపి రద్దు చేస్తుందనే చర్చ జరుగుతున్నదన్నారు. ప్రజలలో ఆనేక అనుమానాలు భయాందోళనలు కలుగుతున్నాయని, ప్రత్యేకంగా కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, ఎస్పీ, ఆర్‌జెడి, డిఎంకె పార్టీలు తీవ్రమైన స్థాయిలో విమర్శిస్తున్నాయని తెలిపారు. ఇది తెలిగ్గా తీసుకునే అంశం మాత్రం కాదని, ఇది శాశ్వతంగా బిజెపికి మచ్చగా మిగిలిపోతుందని ఆయన హెచ్చరించారు.

# జూన్ 18, 19న హైటెక్స్‌లో సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న టిసిఈఐ, ఎస్ఐడబ్ల్యుపి సభ్యులు తదితరులు

గచ్చిబౌలి, మే 4, ప్రభాతవార్త : గత నగరంలోని హైటెక్స్ ఎక్జిబిషన్ సెంటర్‌లో జూన్ 18,19వ తేదీల్లో సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ మూడో ఎడిషన్ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశం సందర్భంగా తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ ఏడో ఎడిషన్ అవార్డుల కార్యక్రమాన్ని సైతం చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు కొండాపూర్‌లోని మాయా కన్వెన్షన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైటెక్స్ ఎక్జిబిషన్ సెంటర్ టిజి శ్రీకాంత్ మాట్లాడుతూ హైటెక్స్ ఎక్జిబిషన్ సెంటర్, తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ(టిసిఈఐ)ల ఆధ్వర్యంలో జూన్ 18,19వ తేదీల్లో నిర్వహించనున్న ఈ వేడుకతో భారతీయ వివాహ పరిశ్రమలోని నిపుణులందరు ఒకే వేదిక మీదకు రానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆస్ట్రేలియాలోని జాన్ ఇమ్మాన్యుయేల్ సహా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన పలువురు నిపుణులు హాజరవుతారని అన్నారు. ఈవెంట్ బజార్ పేరుతో ఎక్స్‌పోను ఏర్పాటు చేసి 60కి పైగా స్టాల్స్‌లో విభిన్న ఉత్పత్తులు, అత్యాధునిక సేవలను ప్రదర్శనకు ఉంచనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టిసిఈఐ అధ్యక్షుడు ఆళ్ల బలరాంబాబు, ప్రధాన కార్యదర్శి రవిబురా, కోశాధికారి తౌఫిక్‌ఖాన్‌తో పాటు శ్రవణ్ మదిరాజు, రామ్ కె ముప్పన, హిరీష్‌రెడ్డి, కుమార్ రాజా, సుధాకర్, సౌరభ్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన బిఎస్పీ నేత జయసింహ

అత్తాపూర్ మే 4, ప్రభాతవార్త : గత ఎన్నికల్లో బీఎస్పి పార్టీ నుండి ఎమ్మెల్యేగా పోటి చేసిన రాచమల్ల జయసింహ బీఎస్పీ ముఖ్యనాయకులతో కలిసి నార్సింగి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్,మున్సిపల్ చైర్మన్ కొలను సుష్మామహేందర్ రెడ్డి,పారేపల్లి శ్రీనివాస్ గైడ్ పేదిరిపాటి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలో ఎమ్మెల్యే ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో పాటు ఆయన వెంట ఉన్న యువ నాయకత్వం పార్టీలోకి రావడం మంచి పరిణామని అందరూ కలిసి చేవెళ్ల ఎంపి అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.పార్టీలో చేరివారిలో మాజీ బిఎస్పి అసెంబ్లీ ఉపాధ్యక్షుడు రాచమల్ల రాజు కుమార్,కార్యదర్శి ఆదిరాల రవికుమార్, మున్సిపల్ అధ్యక్షుడు చిన్నగాండు భాస్కర్,కార్యదర్శి ఉటు అశోక్,పెద్దగండు నర్సింగ్ రావు,ప్రధాన కార్యదర్శి చింతమోని రమేష్,కోశాధికారి రాచమల్ల రవీందర్,అంకేంగాళ్ల సందీప్,మండల నాయకులు రవీతేజ,మహేష్,సునీల్,రాచమల్ల మదన్,తదితరులు ఉన్నారు.

# ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త : నిరుద్యోగ యువతి యువకుల కోసం పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ (గ్రీన్ ల్యాండ్స్) సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు డాక్టర్ విజయలక్ష్మీ, గురు సెవార్, విద్యాభూషన్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లమా అర్హతతో ఎస్ఎమ్‌టీ ఆపరేటర్స్, ప్రొడక్షన్ ఆపరేటర్స్ 150 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. వీరికి వేతనం నెలకు రూ. 16వేలు ఉంటుంది. ఐటీఐ అర్హతతో ఎస్ఎమ్‌టీ ఆపరేటర్స్, ప్రొడక్షన్ ఆపరేటర్స్ 220 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. వీరికి వేతనం నెలకు రూ. 15వేలు ఉంటుంది. 10, ఇంటర్ అర్హతతో ఎస్ఎమ్‌టీ ఆపరేటర్స్‌కు 180 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. వీరికి వేతనం నెలకు 14వేలు ఉంటుంది. ఈ ఉద్యోగాలకు యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ట వయో పరిమితి 33 సంవత్సరాలు, ఆసక్తి గలవారు ఈ నెల 8వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు కోరారు. మరిన్నీ వివరాలకు పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వెబ్‌సైట్, ఫేస్‌బుక్ పేజీలు, ఫోన్ : 9542433427 / 9515658033లలో సంప్రదించవచ్చును.

## నాదోపాసన ద్వారా భగవంతుని తెలుసుకోవచ్చని
# నిరూపించిన వాగ్గేయకారుడు త్యాగరాజస్వామి



కార్యక్రమంలో పాల్గొన్న చల్లా నాగసుధ, గాయనీమణులు

చిక్కడపల్లి, మే 4 ప్రభాతవార్త: నాదోపాసన ద్వారా భగవంతుని తెలుసుకోవచ్చని నిరూపించిన వాగ్గేయకారుడు త్యాగరాజ స్వామి అని వక్తలు కీర్తించారు. వాగ్గేయకారుడు త్యాగరాజస్వామి 257 జయంతి ఉత్సవం కార్యక్రమం శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. నిర్వాహక సంస్థ అధినేత్రి, ప్రముఖ గాయనీ చల్లా నాగసుధ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ఆమె శిష్యబృందం కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచ రత్నకీర్తన గోష్ఠగానం కార్యక్రమంలో భాగంగా ముందుగా జగదానంద కారక,దుడుకుగల, సాధించెనె, కనకనరుచిరా, ఎందరోమహానుభావులు పంచరత్న కీర్తనలతో ఆ ప్రాంగణం ఆధ్యాత్మికసాగరంలో అందరిని అలరించింది. వయోలిన్‌పై అచ్యుతకుమారి, మృదంగంపై శేషశర్మ వాద్యసహకారాన్ని అందించారు. గాయనీమణులు టి.లక్ష్మీప్రభ, చల్లా నాగసుధ, నాగమీనాక్షి, వంగర ఉష తదితరులు అద్భుతంగా గానంచేశారు.

# బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలి

### ఎంఐఎం అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ


ఎంపి అసదుద్దీన్ ఓవైసీ పాతబస్తీలో పాదయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

చార్మినార్, మే 4 ప్రభాత వార్త : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గ్యారంటీ లంటే రాజ్యాంగాన్నిమార్పు చేయడం,రిజర్వేషన్లు రద్దు చేయడం, దేశంలోని మైనార్టీలకు వ్యతిరేకంగా వ్యాట్లాడ్‌ వేంస్‌ని ఎఐఎంఐఎం అధ్యక్షులు, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎంఐఎం అభ్యర్ధి అసదుద్దీన్ ఓవైసీ అన్నారు.చార్మినార్ అసెంబీంల నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో అసదుద్దీన్ ఓవైసీ శనివారం పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి అన్ని రంగాలలోను విఫలమైందని,కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానిది హిందూత్వమే ఏకైక ఏజెండా అని అన్నారు.బిజెపి హిందూత్వ దేశంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నదని,దేశంలో మతం పేరిట విద్వేషాలను రెచ్చ గొడుతూ ఓటు బ్యాంక్‌ను పెంచుకునేందుకు బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని ఆయన తెలిపారు.దేశంలోని ముస్లింలపై నిత్యం విషం కక్కుతుండటం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో అధికారంలోకి రాకుండ అడ్డు కోవలసిన అవసరం ఎంతైనా ఉందని,అడ్డుకోకపోతే రాజ్యాంగానికి, రిజర్వేషన్లుకు ముప్పు తప్పదని ఎంఐఎం అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ ఆంధోళన వ్యక్తం చేశారు. అన్ని రంగాలలోను ముస్లింలు చాలా వెనుకబడి ఉన్నారని,తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్రలో అమలవుతున్న రిజర్వేషన్లు సామాజిక,విద్యా పరమైన అన్ని రంగాలలో వెనుక బాటు కారణంగా అందిస్తున్నారని ఆయన వెల్లడించారు.ముస్లింల అభివృద్ధి బిజెపికి నచ్చుటం లేదని, దీని కారణంగానే రిజర్వేషన్లు రద్దు చేస్తామని బిజెపి ప్రభుత్వం అంటున్నదని ఆయన తెలిపారు. ఎంఐఎం హయాంలోనే పాతబస్తీ అన్ని రంగాలలోను అభివృద్ధి సాధించిందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ,మాజీ శాసన సభ్యులు ముంతాజ్ అహ్మద్ ఖాన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘం, వికలాంగుల సంఘం
# సికింద్రాబాద్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి పద్మారావుకు మద్దతు

సైఫాబాద్, మే 4 ప్రభాతవార్త: గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిగలకు ఎంతో మేలు చేసిందని అందువల్ల సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటి చేస్తున్న తీగుళ్ల పద్మారావుకు సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నామని మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘం, వికలాంగుల సంఘం (ఎంఆర్‌పిఎస్) ప్రకటించింది. బడుగు బలహీన వర్గాల ముద్దు బిడ్డ పద్మారావును అన్న అని పిలిస్తే చాలు ఆపదలో ఉన్నవారిని అదుకునే మంచి మనసు ఉన్న వ్యక్తి అని సమితి నాయకులు వివరించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ మీసాల కురుమయ్యమాదిగ, కార్యనిర్వాహక అధ్యక్షుడు చేకూరి గణేష్, మాదిగ స్టూడెంట్ పొలిటికల్ జెఎసి ఛైర్మన్ బుషిపాక గణేష్, ప్రధాన కార్యదర్శి పుట్టల సందీప్‌మాదిగ, అంబర్‌పేట వికలాంగుల సంఘం అధ్యక్షుడు జూపల్లి శ్రావణ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ పద్మారావు విజయం కోసం మాదిగలు, విద్యార్థులు, ఉద్యోగులు, వికలాంగులు, మేధావులు, వృద్దులు పెద్ద ఎత్తున ప్రచారం చేసి గెలిపించుకుంటామని స్పష్టం చేశారు.

బిఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని తీసుకువచ్చిందని, రైతులకు రైతు బంధు పథకం తీసుకువచ్చిందని, వికలాంగులకు పెన్షన్‌ను పెంచిందని, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో తగినన్ని సీట్లు కేటాయించిందని వారు ఈ సందర్భంగా వివరించారు. మాదిగలకు వ్యతిరేకంగా ఉన్న కాంగ్రెస్, బిజెపి పార్టీల అభ్యర్థులను చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు.

# పాతబస్తీ రౌడీషీట్లరకు కౌన్సెలింగ్



చార్మినార్, మే 4 ప్రభాతవార్త : రౌడీ షీటర్లు సత్ ప్రవర్తనతో మెలగాలని ఫలక్ నుమా ఎసిపి బి.వై.స్వామి అన్నారు. ఎన్నికల పోలింగ్ సందర్భంగా ముందు జాగ్రత్తగా శనివారం కాలాఫత్తర్, బహదూర్‌పుర, ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ల పరిధి లోని నలభై ఐదు మంది రౌడీషీటర్లకు ఫలక్‌నుమా ఏసిపి కార్యాలయం ఆవరణలో కౌన్సిలింగ్ ఇచ్చారు.ఈ సందర్భంగా ఫలక్‌నుమా ఎసిపి బి.వై.స్వామి మాట్లాడుతూ రౌడీ షీటర్లు మంచి ప్రవర్తనతో మెలగాలని,బెదిరింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కాలాఫత్తర్ ఇన్‌స్పెక్టర్ గోపీ, ఫలక్‌నుమా సిఐ ఆదిరెడ్డి, బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్ఐలు పాల్గొన్నారు.

# నేడు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో బిజెపి బహిరంగ సభ

కంటోన్మెంట్, మే 4 ప్రభాతవార్త: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో బిజెపి భారీ బహిరంగ ఒసభ నిర్వహించనున్నట్లు మల్కాజిగిరి పార్లమెంట్ బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే భారీ బహిరంగ సభకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డితో పాటు రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బిజెపి కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

## కంటోన్మెంట్‌లో బిఆర్ఎస్‌ను గెలిపించాలి : రావుల శ్రీధర్ రెడ్డి


6వ వార్డు కార్తీక్ ఎన్‌క్లేవ్ కాలనీ ప్రతినిధులతో సమావేశంలో ప్రసంగిస్తున్న రావుల శ్రీధర్ రెడ్డి, పాండు యాదవ్

కంటోన్మెంట్, మే 4 ప్రభాతవార్త: కంటోన్మెంట్‌లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌ఛార్జి రావుల శ్రీధర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్‌లు తెలిపారు. శనివారం కంటోన్మెంట్ 6వ వార్డులోని కార్తీక్ ఎన్‌క్లేవ్, కిరణ్ ఎన్‌క్లేవ్,జవహర్ రైల్ కాలనీ, జూపిటర్ కాలనీ పరిసర ప్రాంతాల్లోని కాలనీ ప్రతినిధులతో సమావేశమై బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ అభ్యర్థి నివేదిత సాయన్నలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

### మంత్రి పొంగులేటిని అభినందించిన ముప్పిడి గోపాల్



కంటోన్మెంట్, మే 4 ప్రభాతవార్త: కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌ఛార్జిగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి బాధ్యతలు అప్పగించినందుకు సంతోష్ వ్యక్తం చేస్తూ శనివారం కంటోన్మెంట్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్ మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనమంతరావ్, కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.శ్రీగణేష్, దళిత రత్న డి.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్,ప్రియాంకా గాంధీ సేన మైనార్టీ వింగ్ ప్రెసిడెంట్‌గా మహ్మద్ ఫయాజ్


ఫయాజ్‌కు నియామకపత్రం ఇస్తున్న కిరణ్‌కుమార్

హైదరాబాద్,మే 4,ప్రభాతవార్త: రాహుల్,ప్రియాంకాగాంధీ సేన రాష్ట్ర మైనార్టీ వింగ్ ప్రెసిడెంట్‌గా నగరానికి చెందిన మహ్మద్ ఫయాజ్ నియమితులయ్యారు. ఈమేరకు శనివారం ఓల్డ్‌ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర సెక్రటరీ జనరల్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఫయాజ్‌కు నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాహుల్,ప్రియాంక గాంధీల ఆలోచనలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీబలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఆర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ మల్లు శివరామ్, రాహుల్, ప్రియాంకా సేన స్టేట్ జాయింట్ సెక్రటరీ టి.రాజేష్, సిటీ ప్రెసిడెంట్ కళ్యాణ్, కృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలి

### హోం ఓటింగ్‌ను పరిశీలించిన కలెక్టర్ శశాంక

అత్తాపూర్ మే 4,ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని రంగారెడ్డి జిల్లా ఎన్నిలక అధికారి, కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. శనివారం రాజేంద్రనగర్‌లోని హైదర్‌గూడ,వాసుదేవ్ నగర్‌లో వయోవృద్ధులు, దివ్యంగులు ఇంటి నుండి వినియోగించుకున్న హోం ఓటింగ్ ప్రక్రియను కలెక్టర్ శశాంక ప్రత్యేకంగా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఓటు మనం బలం అన్ని ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని తెలిపారు. వయోవృద్ధులు,దివ్యంగుల నుండి తమ సిబ్బంది హోం ఓటింగ్ తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, తహసీల్దార్ పాల్గొన్నారు.


వృద్ధుడిని హోం ఓటింగ్ తీసుకుంటున్న కలెక్టర్ శశాంక

# కల్లబొల్లి మాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుంది

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్


బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశమైన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్, మే 4 ప్రభాతవార్త: లోక్ సభ ఎన్నికల గడువు సమీపిస్తున్నందు వల్ల ప్రచారాన్ని మరింత ఉధృతం చేయాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. శనివారం మారేడ్‌పల్లి లోని తలసాని నివాసంలో సనత్‌నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలుఇచ్చారు. ఎన్నికల ప్రచారం జరుగుతున్న తీరు,ప్రజల నుండి లభిస్తున్న స్పందన గురించి అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు 9 రోజులు మాత్రమే గడువు ఉన్నందున కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి బిఆర్ఎస్ ప్రభుత్వం జరిగిన అభివృద్ధి, ప్రజలకు వివరించాలని తెలిపారు. కల్లబొల్లి మాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏవిధంగా మోసం చేస్తుందో ప్రజలకు వివరిసస్తూ బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకు కారు గుర్తుకు ఓటు వేయించాలని సూచించారు. సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుకు రోజు రోజుకు ప్రజాదారణ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ మహేశ్వరీ, మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్, శేషుకుమారి, నాయకులు గుర్రం పవన్ కుమార్ గౌడ్, అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరిక్రిష్ణ, బాల్‌రెడ్డి, వెంకటేశ్ రాజ్, మహేశ్ యాదవ్, అంజలి యాదవ్, యేసూరి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల దృష్టికి వాటర్ ప్లాంట్ల సమస్య


రహ్మత్‌నగర్‌లో ప్రజా సమస్యలపై పాదయాత్ర చేస్తున్న కార్పోరేటర్ సిఎన్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, మే 4, ప్రభాతవార్త : ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికపుడు డివిజన్ పరిధిలో బస్తీల కాలనీలలో పాదయాత్రలు చేసి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని రహ్మత్‌నగర్ కార్పోరేటర్ సిఎన్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని పలు బస్తీల కాలనీలలో సమస్యలు తెలుసుకునేందుకు పాదయాత్ర నిర్వహించారు. స్థానికంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలో వాటర్ ప్లాంట్లు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని తిరిగి ఓపెన్ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని కార్పోరేటర్ హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో మన్సూర్, ఎక్బాల్, షరీఫ్, ప్రసాద్, రవి, సాబేర్, ఆండాలు, పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేత క్రిషాంక్‌ను కస్టడికి కోరిన ఒయూ పోలీసులు

తార్నాక, మే 4 ప్రభాతవార్త : ఉస్మానియా యూనివర్సిటీలో మెస్‌ల మూసివేతపై విద్యుత్, మంచి నీటి కొరత ఉందంటూ సామాజిక మద్యమాల ద్వార దుష్ప్రచారం చేసిన కేసులో అరెస్టు అయిన బీఆర్ఎస్ నేత మన్నె క్రిషాంక్‌ను పోలీసులు కస్టడికి ఇవ్వాలని నాంపల్లి కోర్టును కోరారు. క్రిషాంక్ ప్రస్తుతం చంచల్‌గూడా జైల్లో ఉన్నాడు. కేసు విచారణలో భాగంగా మరిన్ని వివరాలను తెలుసు కునేందుకు శనివారం ఒయూ పోలీసులు అతనిని కస్టడికి ఇవ్వాలని నాంపల్లి కోర్టును కోరారు. దీంతో పోలీసుల అభ్యర్థనపై స్పందించిన కోర్టు ఒక రోజు క్రిషాంక్‌ను కస్టడికి అనుమతించినట్లు ఇన్స్‌పెక్టర్ రాజేందర్ పేర్కొన్నారు.

## టికెఆర్‌లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

హైదరాబాద్,మే 4,ప్రభాతవార్త: నగరంలోని టికెఆర్ ఎడ్యూకేషనల్ సొసైటీ కళాశాల తన 22వ వార్షికోత్స వేడుకలను ఘనంగా నిర్వహించింది. మీర్‌పేట్‌లోని క్యాంపస్‌లో "షిజ్నే 2024"పేరుతో ఏర్పాటు చేసిన కాలేజ్‌ఫెస్ట్‌లో ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ కార్తీక్ లైవ్ ఇన్ కాన్సర్ట్ జరిగింది. విద్యార్థులతో క్యాంపస్ మొత్తం కిక్కిరిసిపోయింది. కార్తీక్ తన పాటలతో విద్యార్థులు ఉత్సాహపరుస్తూ జోష్ నింపాడు. అలాగే మొదటి రోజు విద్యార్థులు, కళాశాల సిబ్బంది వివిధ సంస్కృతులు, సంప్రదాయాలను సూచించే భారతీయ సాంప్రదాయ దుస్తులను ధరించారు. ఈకార్యక్రమంలో రక్షణమంత్రిత్వశాఖ సైంటిపిక్ అడ్వైజర్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరుకాగా రంగారెడ్డిజిల్లా చైర్‌పర్సన్ డాక్టర్ అనితా రెడ్డి పాల్గొన్నారు. ఈఫెస్ట్‌ను మూడురోజులపాటు జరుపుకోన్నుట్లు కళాశాల కార్యదర్శి హరినాథ్‌రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో చైర్మన్ తీగలకృష్ణారెడ్డి, కోశాధికారి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## విజయవంతంగా బైబిల్ పాఠశాల తరగతులు'

చిక్కడపల్లి, మే 4 ప్రభాతవార్త: ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచి గోల్కొండక్రాస్‌రోడ్స్ హెబ్రోన్‌చర్చ్ ఆధ్వర్యంలో 'విరామ బైబిల్ పాఠశాల తరగతులు' శనివారం విజయవంతంగా ముగిశాయని చర్చ్ చర్చ్ సొసైటీ చైర్మన్ జెసెఫ్ పి.కురియన్, ప్రధాన కార్యదర్శి ఆర్.వీరాచారి వివరించారు. హెబ్రోన్ చర్చ్ ఆధ్వర్యంలో వీబీఎస్ తరగతుల ముగింపు సందర్భంగా శనివారం 'సువార్తర్యాలి'ని ప్రారంభించిన అనంతరం జెసెఫ్ పి.కురియన్, వీరాచారి మాట్లాడుతూ బ్రదర్ భక్తసింగ్ స్థాపించిన హెబ్రోన్‌చర్చ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయన ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నామని, 10 రోజుల పాటు ఈ తరగతులను నిర్వహించామన్నారు. ఈ తరగతుల నిర్వహణలో పాల్గొన్న వారికి మానసిక, ఆధ్యాత్మిక చైతన్యం కల్పించడం జరిగిందన్నారు.ప్రతిభ కనబర్చిన పిల్లలకు ప్రత్యేకంగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఓబెద్ జాన్, శామ్యూల్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించిన మాదిగ సంక్షేమ సంఘం


సమావేశంలో మాట్లాడుతున్న రాపోలు రాములు

సైఫాబాద్, మే 4 ప్రభాతవార్త : మాదిగలను అన్ని విధాల మోసం చేసిన బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెపుతామని ఆది నుంచి దళితులు, మాదిగలను అన్ని విధాల అదుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటిస్తున్నామని తెలంగాణ అంబేద్కర్ సంఘాల సమాఖ్య, తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం మద్దతు ప్రకటించాయి. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంఘాల నేతలు రాపోలు రాములు, యాదయ్య, మల్లికార్జున్ తదితరులు మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి కెసిఆర్ దళితుడ్ని సిఎం చేస్తానని, దళితులకు మూడు ఎకరాలు పంపిణి చేస్తామని, కెజి టూ పిజి వరకు ఉచిత విద్యను అందిస్తానని, ఇంటికొక ఉద్యోగం ఇస్తానని మోసం చేశారని ఆరోపించారు. బిజెపి 100 రోజుల్లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి పది సంవత్సరాలు కాలయాపన చేసిందని, ఎన్నికల ముందు కమిషన్ వేసి ఇంకా జాప్యం చేసిందని, బిజెపి పాలనలో దళితులపై దాడులు, హత్యలు పెరిగిపోయాయని, రాజ్యాంగాన్ని మార్చుతామని ప్రకటించిందని ఆరోపించారు.

## ఘనంగా మిడ్‌వైఫ్ దినోత్సవ వేడుకలు

హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త: ఫెర్నాండేజ్ ఫౌండేషన్ ఆధన్వర్యంలో శనివారం అంతర్జాతీయ మిడ్‌వైఫ్ (మంత్రసాని)దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బంజారాహాల్స్‌లోని ఫెన్నాండెజ్ స్టార్క్‌హోమ్, బొగ్గులకుంటలోని ఆసుపత్రిలో సహజ జననాల కోసం అవసరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణీ తల్లులకు ఆరోమాథెరఫీ, వాటర్ బర్త్ వంటి వినూత్నపద్దతులపై వివరించారు. అలాగే గర్భినీ తల్లులు శారీరక, మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవడానికి అనువైన వ్యాయామాలను తెలియజేశారు. ఈసందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ ఎవిటా ఫెర్నాండేజ్ మాట్లాడుతూ "ప్రతి గర్భిణీ స్త్రీ డెలివరీ సమయంలో తన సంరక్షణలో భాగంగా మంత్రసాని పాత్ర ఎంతో ఉంటుందన్నారు. ప్రసూతి వైద్యులు, వృత్తిపరమైన మంత్రసానులు కలిసి పనిచేసినప్పుడే మెరుగైన ఫలితాలు అందించగలుగుతామని ఛీఫ్ మెడకిల్ ఆఫీసర్ డాక్టర్ తారకేశ్వరి తెలిపారు. ఈకార్యక్రమంలో డిమ్‌వైఎప్ సర్వీసెస్ డైరెక్టర్ ఇందర్‌జీత్ కౌర్ తదితరులు పాల్గొన్నారు.

## నిమ్స్ డైరెక్టర్‌కు అరుదైన గౌరవం



హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త: నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్పకు అరుదైన గౌరవం దక్కింది. దేశంలోని సీనియర్ సర్జన్‌గా పలు విభాగాల్లో సేవలు అంది స్తున్నందుకు గానూ రాయల్ కాలేజ్ ఆఫ్ పిజిషిన్స్ అండ్ సర్జన్స్ ఆఫ్ గ్లాస్గో ఎఫ్ఆర్‌సిఎస్ (ఫెలోషిప్ ఆఫ్ ది రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్) అవార్డుతో గౌరవించ నుంది. ఆకళాశాల 486 ఏళ్లన్ల చరిత్రలో ప్రభుత్వ రంగ ఆస్పత్రి సర్జన్‌కి కేటాయిం చడం ఇదే ప్రథమం. డైరెక్టర్ బీరప్ప వైద్యవృత్తిలో అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు చేయడంతో పాటు ఆస్పత్రిలో పేద రోగు లకు నాణ్యమైన సేవలు, వేగంగా అందించేలా చొరవ తీసుకున్నారు. ఓ సర్జన్‌గా వేల శస్త్రచికిత్సలు విజయ వంతంగా పూర్తి చేశారు. ఈ ఏడాది నవంబర్ లేదా డిసెంబర్‌లో గ్లాస్గోలో నిర్వహించే సదస్సులో ఆయనకి ఎఫ్ఆర్‌సిఎస్ అవార్డుతో సత్కరించనున్నారు.

# ఓటింగ్ రోజు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలి

హైదరాదాద్, మే 4,ప్రభాతవార్త: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మే13వ తేదీన ఓటింగ్ ఉన్నసందర్భంలో పోలింగ్ సిబ్బంది, ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం పార్లమెంట్, అసెంబ్లీ రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసుతులు, ఎండలు తీవ్రంగా ఉన్న క్రమంలలో పోలింగ్ కేంద్రాల వద్ద షామియానా, త్రాగునీరు ఏర్పాటులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈవసతులను ఏర్పాటు చేసేందుకు ఒక ఇంచార్జ్‌ని ఏర్పాటు చేసిన అతని పేరు హోదా వివరాలు తెలియజేయాలని ఆర్‌వో,ఏఆర్‌వోలను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో లైటింగ్, ఫ్యాన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్న నేపథ్యంలో ఎన్నికల అధికారులకు సిబ్బందికి జ్యూస్, మజ్జిక ఏర్పాటు చేయాలని ఈఏర్పాట్లకోసం సెక్టార్ ఆఫీసర్ వద్ద కొంతమొత్తం అడ్వాన్స్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శేఖర్‌యాదవ్

## చలివేంద్రాల ద్వారా ప్రజలు దాహార్తిని తీర్చాలి గడ్డం శేఖర్ యాదవ్

**శంషాబాద్, మే 4, ప్రభాతవార్త:** వేసవి కాలంలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ అన్నారు. శంషాబాద్ మండలంలోని నర్కుడ మదనపల్లి కవేలిగూడ గ్రామాలలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆయన శనివారం ప్రారంభించారు. వేసవికాలంలో దాహంతో అలమటించే ప్రయాణికులు బాటసారుల దాహాన్ని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతో తోడ్పడతాయని అన్నారు. యువజన కాంగ్రెస్ నాయకులు స్వచ్ఛంద సేవా సంస్థల వారు ముందుకు వచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమలో నర్కుడ తొంటఅశోక్ సెల్ మండల ప్రెసిడెంట్ గణేష్ నాయక్, కా ంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శేఖర్ యాదవ్ కిషన్‌నాయక్ ప్రవీణ్ కుమార్ రాకేష్ మహేష్ యాదవ్ పాండు యాదవ్ కిరణ్ సంపత్ సందీప్ వినోద్ సాయి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు శంషాబాద్‌కు రేవంత్‌రెడ్డి రాక

**శంషాబాద్, మే 4, ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నిర్వహించే రోడ్‌షో కార్నర్ మీట్టింగ్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారని శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్, మునిసిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ యాదవ్ తెలిపారు.

### ఆపదలో ఉన్నవారికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం


ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

**కేశంపేట, మే 4, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో ఆరు రోజుల క్రితం బ్యాగరి పోచయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. వారిది నిరుపేద కుటుంబం అయినందున దశదిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నాయకుడు బీస కరుణాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల ఉపాధ్యక్షుడు లాలమోని చంద్రయ్య ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం 4500 రూపాయలను పోచయ్య కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సివెంకట్‌రెడ్డి పోగుల భీమయ్య గుత్తి చంద్రయ్య గుత్తిశేఖర్ కంద నసిమ్మయ్య పోగుల నర్సింలు పబ్బతి మల్లయ్య కొమిరే లింగం సుబాన్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అంతారం రాములు పోగుల అంజయ్య మంగలి రాజు పోగుల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### బిజెపిలో చేరిన రాయిలాపూర్ బిఆర్ఎస్ నాయకులు గ్రామాల్లో కాళీ అవుతున్న బిఆర్ఎస్

**మేడ్చల్, మే 4, ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలో గ్రామాల వారిగా రోజురోజుకు బిజెపిలో చేరికలు పెరగడంతో బిఆర్ఎస్ పార్టీ కాళీ అవుతున్నది. గ్రామాల నుంచి మాజీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ శాఖ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు బిజెపి తీర్థం పుచ్చుకుంటున్నారు. మండలంలోని రాయిలాపూర్ గ్రామ బిఆర్ఎస్ నేతలు శుక్రవారం నాయకుడు నందారెడ్డి, మాజీ జడ్పిటిసి శైలజా హరినాద్ ఆధ్వర్యంలో బిజెపి మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్ష్యంలో బిజెపిలో చేశారు. ఈ సందర్భంగా చేరిన వారికి ఈటల రాజేందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్‌తో పాటు పార్టీలో చేరిన గ్రామ మాజీ సర్పంచ్ బినర్సింహ ముదిరాజ్, మాజీ ఉప సర్పంచ్ ఎం పెంటారెడ్డి, నాయకులు ఎం రవీందర్‌రెడ్డి, ఎంహన్మంత్‌డ్డి, ఎంశ్రీనివాస్‌రెడ్డి, బి మల్లేష్, బిచందర్‌పాల్‌రెడ్డి, ఎం సాయినితిన్‌రెడ్డి, ఎంయశ్వంత్‌రెడ్డి, టినవీన్ కుమార్, ఎంవెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వికాస్‌రెడ్డి మృతి బాధాకరం

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


వికాస్‌రెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తు్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు

**షాద్‌నగర్, మే 4, (ప్రభాతవార్త) :** కిషన్‌నగర్ గ్రామానికి చెందిన బుచ్చిరెడ్డి కుమారుడు వికాస్‌రెడ్డి శనివారం హాజిపల్లి రోడ్డులో బైక్ ప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వాసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం వికాస్ తండ్రి బుచ్చిరెడ్డిని ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చేతికి అందివచ్చిన కొడుకు అకాలమరణం చెందడం చాలా బాధకరమైన విషయమని అన్నారు. వికాస్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని కోరుతున్నాని అన్నారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కిషన్‌నగర్ ఉన్నారు.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**కొత్తూర్, మే 4, ప్రభాతవార్త :** గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈసంఘటన కొత్తూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చేగూర్ రోడ్డు వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. సీఐ నరసింహారావు వివరాల ప్రకారం...నాగర్ కర్నూలు జిల్లా శ్రీపురానికి చెందిన కల్మూరు సురేష్ టైల్స్ పనిచేస్తూ కొత్తూర్‌లో జీవిస్తున్నాడు. అయితే శుక్రవారం అర్ధరాత్రి చేగూర్ ఎక్స్ రోడ్డు వద్దకు వెళ్లి రాత్రి రెండు గంటల సమయంలో తిరిగి వస్తున్నాడు. కొత్తూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

### కార్టూన్‌నెట్‌వర్క్‌లో వన్పీస్‌ల్యాండ్‌ఆఫ్‌వానోఆర్క్

సంస్కృతిసంప్రదాయాలకు నెలవుమన భారతదేశం. మనదేశంపు రాజాలకు ఇతిహాసాలకు నెలవు. అంతేకాకుండా ఎన్నో జానపద కథల కు పుట్టినిల్లు. అలాంటి కథతో రూపొందించిన ఒకషో ఇప్పుడు కార్టూన్ నెట్‌వర్క్‌లో రాబోతుంది. మొదటిసారిగా భారతీయ టెలివిజన్‌లో వన్పీస్ ల్యాండ్ ఆఫ్‌వానో ఆర్ క్ కథాంశంతో ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలుపొందిన మాంగా సిరీస్‌వన్పీస్సను ప్రకటించిందికార్టూన్ నెట్‌వర్క్.

## తండ్రి కోసం తనయుడి ప్రచారం

### స్కాములు చేసే కాంగ్రెస్ వద్దూ..స్కీములు ఇచ్చే బీజేపీ రావాలి

### చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడి ప్రచారం


ఎన్నికల ప్రచారం మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు విశ్వజిత్‌రెడ్డి

**వికారాబాద్,మే 4, ప్రభాతవార్త:** చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం ఆయన తనయుడు కొండా విశ్వజిత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. శనివారం ధారూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో స్థానిక నాయకులు, కార్యకర్తలు కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అ నిత్యం ప్రజల కోసం పనిచేసే కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కోటిపల్లి ప్రాజెక్టు వద్ద బోటింగ్ ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని ఆయన గుర్తు చేశారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే ఇక్కడి యువతకు మరింత ఉపాధి అవకాశాలు కల్పిస్తారని అన్నారు. స్కాములు చేసే కాంగ్రెస్ పార్టీ కి కాకుండా..ప్రజల సంక్షేమం కోసం స్కీములు ఇచ్చే బీజేపీ ని ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కోరారు. అనంతరం కుక్కింద గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు బీరప్ప, మహేష్ వారి అ ుచరులు బిజెపి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు, మండల పార్టీ అధ్యక్షుడు రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు వివేకానందరెడ్డి, సీనియర్ నాయకులు పాండు గౌడ్, అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజునాయక్, మహిళా మోర్చా అధ్యక్షురాలు యాష్కి శిరీష, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, మాధవి, మంజుల జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ, రామకృష్ణారెడ్డి, అనిల్ గౌడ్, మణికంఠ రెడ్డి, రాఘవేందర్ గౌడ్ తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## రంగాపూర్‌లో బిఆర్ఎస్‌కు బిగ్ షాక్

### కాంగ్రెస్‌లో చేరిన తాజా మాజీ సర్పంచ్ రమేష్‌గౌడ్

**నందిగామ,మే 4 ప్రభాతవార్త :** నందిగామ మండలం రంగాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీకి షాక్‌మీద షాక్ తగిలింది. బిఆర్ఎస్ పార్టీకి చెందిన తాజా మాజీ సర్పంచ్ ఎనుగొండ రమేష్‌గౌడ్ మాజీ ఉపసర్పంచ్ సుజాత చంద్రశేఖర్ యాదవ్ మాజీ వార్డు సభ్యులు కల్వకోలు శేఖర్ గౌడ్ నవపేట్ శ్రీనివాస్ గౌడ్ కేశవులులతోపాటు సుమారు 10 మంది ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాజీ ఎమ్మెల్యే చెవులపల్లి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపి ఇన్ మంజుల తులసిరామ్ చౌహాన్ సింగిల్ విండో చైర్మన్ తోట రాజగోపాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగా నరిసింహులు ఎంటిసి దేపల్లె కుమారస్వామిగౌడ్ కాంగ్రెస్ నాయకులు జ్ఞానేశ్వర్ శ్రీనునాయక్ గబ్రుచౌహాన్ నాగరాజు తదితరులు ఉన్నారు.

### కళాకారులను సన్మానించిన ఎన్ఆర్ఐ హరిప్రసాద్


మాస్టర్ మహేష్‌చారికి తబలాను అందిస్తున్న ఎన్ఆర్ఐ హరిప్రసాద్

**కొడంగల్,మే 4ప్రభాతవార్త** కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో పట్టణానికి చెందిన దివంగత విశ్రాంత ఉపాధ్యాయులు నరహరి వశిష్ట మూడవ వర్ధంతిని పురస్కరించుకొని భక్తి గీతాలు, సంగీత కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణానికి చెందిన వివిధ ఆలయాల భజన మండలి సభ్యులతో పాటు అధ్యాత్మిక ధార్మిక సేవా సమితి సభ్యులు, తాండూర్ పోట్లీ మహరాజ్ సంస్థాన్ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. అనంతరం నరహరి వశిష్ట జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు శ్రీహరి వశిష్ట, మురహరి వశిష్ట, ఎన్ఆర్ఐ కె.హరిప్రసాద్ వశిష్ట, అభిలాష్‌రెడ్డి, భవాని కృష్ణలు కళాకారులను ఘనంగా సన్మానించారు. పట్టణానికి చెందిన కళాకారుడు మహేష్‌చారికి నరహరి వశిష్ట కుటుంబసభ్యులు రూ. 25వేల విలువ కలిగిన తబలాను బహుకరించచారు. హజరైన 70 మంది కళాకారులకు ప్రముఖ పుణ్యక్షేత్రం పండరీపూర్ నుంచి తీసుకువచ్చిన తాళాలను అందజేశారు. పట్టణానికి చెందిన వివిధ ఆలయాల భజన మండలి సభ్యులు నందారం శ్రీనివాస్, పాతకొట్ల గోపాల్, అక్కి శ్రీనివాసామూర్తి, రఘుమాస్టర్, డిడిఎన్ఎస్ జిల్లా అధ్యక్షులు లోకూర్తి జయతీర్థాచారీ, అధ్యాత్మిక ధార్మిక సేవా సమితి సభ్యులు డాక్టర్ హీరాలాల్, కొత్తూర్ పాండురంగయ్య, తుకారాం, బత్తుల మొగులయ్య, బాకారం సాయిలు, తాండూర్ పోట్లీ మహరాజ్ సంస్థాన్ సభ్యులు భజన మండలి మాస్టర్లు హిందూర్ రాములు, శేఖర్, మనోజ్, సాయన్న, నిహాల్, స్థానిక నాయకులు మాజీ జడ్పీటీసీ ఏన్గుల భాస్కర్, కుర్వ ఎల్లప్ప, తలారి బిచ్చప్ప తదితరులు పాల్గొన్నారు.

### భగీరథ నీరు వృధా ..


గవ్వలపల్లిలో వృధాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

**చిన్నశంకరంపేట,మే4,ప్రభాతవార్త:** త్రాగు నిరు రావటం లేదని ఇటీవలే చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనివాసులు మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై ఖాళీ బిందేలతో నిరసన వ్యక్తం చేసి వారం రోజులు గడవక ముందే మండలంలోని గవ్వలపల్లి వద్ద మిషన్ భగీరథ పైపు లైన్ పగిలి పెద్ద ఎత్తును నీరు వృధాగా పోతున్నాయి. ఉన్నతాధికారులు మిషన్ భగీరథ, గ్రామ ప్రత్యేక అధికారులతో సమీక్షా నిర్వహించి గ్రామాలలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. అయినప్పటికి అధికారుల నిర్లక్ష్యం వల్ల నీరు వృధాగా పోతున్న పట్టించుకునే వారు కరువయ్యారు. నీటి వృధాను అరికట్టాలని, అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. ఈ విషయమై వార్త ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయినిఖీలాను వివరణ కోరగా పరిశీలించి వెంటనే చర్యలను తీసుకుంటామని తెలిపారు.

### కొడంగల్ బస్టాండ్‌ను పరిశీలించిన ఆర్టీసీ చీఫ్ ఇంజనీర్

**కొడంగల్,మే 4ప్రభాతవార్త** కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్‌ను ఆర్టీసీ ఇంజనీరింగ్ విభాగం చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. శనివారం ఆయనతో పాటు ఇంజనీరింగ్ విభాగం బృంధం సభ్యులు రమణమూర్తి, బీఆర్ సింగ్ తదితరులు ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఆర్టీసీ బస్టాండ్‌లో మూత్రశాలలను పెంచడంతో పాటు బస్టాండ్‌లో వసతులను మెరుగుపరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. కాగా గతనెల 24న టీఎస్‌ఆర్టీసీ హైద్రాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం నాయక్ తనిఖీ చేయడంతో పాటు ఆయన పరిశీలనకు వచ్చిన విషయాలను వివిధ విభాగాల అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తంనాయక్ ఆదేశాలతో ఆర్టీసీ ఇంజనీరింగ్ అధికారులు కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు.


ఘట్‌కేసర్‌లో వ్యాపారి నుంచి స్వాధీనం చేసుకున్న నగదు

## వాహన తనిఖీలో రూ.5 లక్షలు స్వాధీనం

**ఘట్‌కేసర్, మే 4, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో శనివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించి రూ.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పార్లమెంట్ ఎని ్నకల నేపథ్యంలో ఘట్‌కేసర్ పట్టణంలోని పెట్రోల్‌బంకు వద్ద పోలీసులు వాహన తనిఖీ జరిపారు. ఇద్దరు వ్యక్తులు బేలనోకారు (టిఎస్10యుసి-1573)లో వెళ్తుండగా పోలీసులు ఆపి తనిఖీ చేశారు. క్రిష్ణా ట్రేడర్స్ వ్యాపారి పెద్ది శ్రీనివాస్ (52) కారులో రూ.5 లక్షలు తరలిస్తుండగా పట్టుకొని ప్రశ్నించగా ఏలాంటి ఆధారాలు చూపకపోవడంతో పంచనామా నిర్వహించి నగదును సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న నగదును మేడ్చల్ జిల్లా గ్రీవియెన్స్ కమిటీకి పంపించినట్లు ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదులు తెలిపారు.

### సీమ ఆంజనేయస్వామి ఆలయంలో అఖండ హరినామ సప్త


సీమ హనుమాన్ ఆలయంలో అఖండ హరినామ సప్త దృశ్యం

**సిర్గాపూర్, మే 4, ప్రభాతవార్త:** మండలంలోని చాప్టా(కె) గ్రామ శివారులో ఉజలంపాడ్ శివారులో శ్రీ సీమ హనుమార్ ఆలయంలో అఖండ హరినామ సప్త మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 5వ రోజైన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ జ్ఞానేశ్వర్‌రెడ్డి మహారాజ్ సేవ కార్యక్రమం నిర్వహించారు. హిందూ ధర్మంలో ఉన్న వార్కారి సంప్రదాయం, దిన దిన అభివృద్ధి చెందేట్లుప్రతి వార్కారి సాంప్రదాయంలో పాల్గొనే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అవుటి సంజీవులు, కిమ్యా నాయక్, సీతారాం తండా వాసులు, హరినామ భక్తులు జ్ఞానేశ్వర్‌రెడ్డిని ఘనగా సన్మానించి ఆశీర్వచనాలు అందుకున్నారు.

### కాంగ్రెస్ భారీ బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన


విలేకరులతో మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

**నర్సాపూర్ మే, 4. ప్రభాతవార్త :** నర్సాపూర్‌లో ఈనెల 7 న నిర్వహించే కాంగ్రెస్ పార్టీ బారీ భహిరంగ సభ ఏర్పాట్లను శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరిశీలించారు. ఈ బారీ భహిరంగ సభకు జాతీయ కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ హాజరవుతున్నందున బారీ ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను మెదక్ ఎంపి అభ్యర్థి నీలం మధు, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ ఆవులరాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే మదనరెడ్డి, రవిందర్‌రెడ్డి లతో కలిసి భహిరంగ సభా స్థళిని పరిశీలించారు. అనంతనం హెలిప్యాడ్ ల్యాండ్ అయ్యే స్థలం ను కూడ పరిశీలించారు. ఈమేరకు సభ నిర్వాహకులకు పలు సూచ నలు సలహాలనుఇవ్వడం జరిగింది నర్సాపూర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలపట్ల యువత అవగాహన పెంచుకోవాలి

**కేశంపేట, మే 4, ప్రభాతవార్త:** యువత క్రమశిక్షణ అలవర్చుకుని విద్యతో పాటు క్రీడా రంగాల్లో రాణించాలని టిఆర్ఎస్ నాయకులు మేఘావత్ జయసింగ్ అన్నారు. కేశం పేట మండల నిర్దవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని శ్యామ్‌రావు తండాలో ఎస్‌పిఎల్ ప్రీమియర్1 లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఐదు రోజులుగా కొనసాగిన ఈ క్రికెట్ పోటీలలో ఐదు జట్లు పాల్గొన్నాయి. మురళీ బహద్దూర్ వెంకటేష్ నితిన్ సురేష్‌లు క్రీడాకారులకు టీ షర్టులు అందజేశారు. పోటాపోటీగా కొనసాగిన ఫైనల్ మ్యాచ్‌లో ముంబై జట్టు విజేతగా నిలువగా ఆర్‌సిబి జట్టు రన్నర్ అప్‌తో సరిపెట్టుకుంది. బెస్ట్ బ్యాటర్‌గా మేఘవత్ రవీందర్ ఎంపికయ్యారు. నగదు బహుమతితోపాటు మెమోంటోలను అందజేశారు. ఈకార క్యక్రమంలో మూడావత్‌రమేష్ బీచ్య భాస్కర్ రంగా తదితరులు పాల్గొన్నారు.

## చెరువుకు గండి పెడుతున్న నాయకుడు

### నావంద్గి పెద్ద చెరువు పూడిక కర్ణాటకకు తరలింపు రూ.1500 నుండి 2వేల వరకు అమ్ముతున్న వైనం అధికార పార్టీ నాయకుల అక్రమాలు

**బషీరాబాద్,మే 4,ప్రభాతవార్త:** నావంద్గీ పెద్ద చెరువులో పూడిక తవ్వకాలకు మిషన్ కాకతీయ పథకం పేరుతో అనుమతులు పొందిన 16 మంది అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. చెరువు పూడికను తవ్వి తమ పంట పొలాల్లో వేసుకుంటామని అనుమతులు తీసుకున్న 16 మంది. నిబంధనలకు విరుద్ధంగా పూడికను తవ్వి కర్ణాటకకు తరలిస్తున్నట్లు సమాచారం. అధికార పార్టీకి చెందిన నాయకులు చెరువు పూడికను 2వేల వరకు ఒక ట్రాక్టర్ చొప్పున పూడికను అమ్ముకొని సొమ్ముచేసుకుంటున్నారని పలువురు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి అక్రమా లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**రైతులకు నష్టం** చెరువు పూడికను తూము భాగంలో తవ్వకుండా చెరువు మధ్యలో తవ్వుతున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. చెరువు మధ్యలో పూడిక తీయటంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతందని తెలిపారు. రైతుల క్షేమం కోసం కాకుండా మత్స్యకారుల ప్రయోజనం కోసం కొంతమంది నాయకులు చెరువులో పూడిక తవ్వకాలు చేపట్టినట్లు తెలిసింది. పూడికతవ్వకాలకు అయ్యే ఖర్చులన్ని మత్స్యకారుడే భరిస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం.


నావంద్గి పెద్ద చెరువులో నుంచి ఒండ్రు మట్టిని తీస్తున్న దృశ్యం


ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

### అక్రమంగా ఇసుక తరలిస్తే కట్టిన చర్యలు : ఎస్ఐ

**కుల్కచర్ల, మే4,ప్రభాతవార్త :** అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక తయారు చేసినా రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని కుల్కచర్ల ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకట్ రాములు బొమ్మరెడ్డిపల్లి నుంచి కుల్కచర్ల మండల కే ంద్రానికి తన సొంత ట్రాక్టర్లో ఫిల్టర్ ఇసుక తీసుకువస్తుండగా గస్తీ కాసిన పోలీసులు ఆధారాలు చూపమని అడిగారు. ట్రాక్టర్ యజమాని ఎలాంటి అనుమతుల పత్రాలు చూపకపోవడంతో ఇసుకతో నిండిన ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక తయారు చేయడం రవాణా చేయడం నేరమని అతిక్రమించిన వారు శిక్షార్హులని ఆయన తెలిపారు. ఇసుకను తీసుకెళ్లేవారు సంబంధిత ఆధికారులచేత తప్పనిసరిగా అనుమతి పొందిన ధ్రువపత్రాలు ఉంచుకోవాలని లేదంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సామాజిక మాధ్యమ వేదికగా కెసిఆర్‌పై అసత్య ప్రచారాలు మానుకోవాలి


పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**కడ్తాల్,మే 04 ప్రభాతవార్త :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై సామాజిక మాధ్యమ వేదికగా అసత్యపు ప్రచారాలు మానుకోవాలని కల్వకుర్తి నియోజకవర్గ ముఖ్యనేతలు ఆకతాయిలను హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమాల నిర్వహణలో భాగంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలతో కలిసి రోడ్‌షో కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మార్గమధ్యలో శ్రీశైలం ప్రధాన రహదారిని అనుసరించి ఉన్న విటాయిపల్లి గ్రామ సమీపాన గల ఛాయ్ దునియా దగ్గర ప్రచార వాహనంలో లెమన్ టీ సేవిస్తున్న సందర్భంలో కొందరు ఆ సన్నివేశాన్ని చిత్రీకించి సామాజిక మాధ్యమాలలో మద్యం సేవిస్తున్నాడని మా అధినాయకుడి పై దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ విషయం బిఆర్ఎస్ శ్రేణుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నందున సామాజిక మాధ్యమ వేదికగా అధినాయకులు కెసిఆర్‌పై అసత్యపు ప్రచారాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కడ్తాల్ పోలీస్ వారికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కడ్తాల్ జడ్పీటిసి దశరథ్‌నాయక్, మాజీ తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహారెడ్డి, కల్వకుర్తి, తలకొండపల్లి, ఆమన్‌గల్ మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు విజయ్‌గౌడ్, శంకర్ యాదవ్, అర్జున్‌రావు, తలకొండపల్లి మాజీ ఎంపిపి శ్రీనివాస్ యాదవ్, కల్వకుర్తి వైస్ ఎంపిపి గోవర్ధన్ గుప్తా, మాజీ సర్పంచ్‌లు సోనా శ్రీను నాయక్, శంకర్ నాయక్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## సిడి తాండ గ్రామపంచాయతీని సందర్శించిన వైస్ ఎంపిపి


సిడి తండా గ్రామపంచాయతీ వద్ద ధ్వంసమైన గేటు దిమ్మెను పరిశీలిస్తున్న వైస్ ఎంపిపి మంజుల తులసిరాం చౌహాన్

**నందిగామ,మే 4 ప్రభాతవార్త :** నందిగామ మండలం చాకలిదానిగుట్ట తండాలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం ప్రధాన గేటును ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ధ్వంసమైన ప్రధాన గేటు దిమ్మెను శనివారం మండల వైస్ ఎంపిపి ఎం మంజుల తులసిరాంచౌహాన్ పరిశీలించారు. జరిగిన ఘటనపై ఆమె కారోబార్ శ్రీనివాస్‌ను ఆరా తీశారు. పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంవల్లే ఘటన చోటుచేసుకుందని పంచాయతీ కారోబార్ వైస్ ఎంపిపి ముందు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనలో ధ్వంసమైన ప్రహరీ దిమ్మెను నిర్మించాలని పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌కు ఫోన్ ద్వారా ఆదేశించారు. ఇంటాంటి ఘటన లు పునరావృతమైతే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కనిపించని ఎన్నికల హడావిడి

**ఆదిభట్ల మే4,ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా బరిలోకి దిగుతున్న పార్టీల ప్రచారాలు నామమాత్రంగానే జరుగుతున్నాయి. ఎన్నికల ప్రచార పర్వానికి వారం రోజుల గడువు మాత్రమే ఉండడంతో ప్రచారంలో ఎలాంటి హడావిడి కనిపించడం లేదు. ఈనెల 13న పోలింగ్ జరగకుండా రెండు రోజుల ముందుగా మే 11 సాయంత్రానికి ప్రచారాలు తెరపడనుంది. పోలింగ్ తేది సమీపిస్తుండడంతో పార్టీల అధినేతలు పెద్దలు సుడిగాలి పర్యటనలు చేసూనత ప్రచారాన్ని హోరు ఎత్తిస్తున్నారు. కానీ మునుపటి ఎన్నికలతో పోలిస్తే ఈసారి ప్రచారాలు చేయడం తక్కువేనని ప్రజలు పేరొంటున్నారు. మరోవైపు పెరుగుతున్న ఉష్ణోగ్రత్తల వల్ల సభలు కార్యక్రమాలకు ఇబ్బందిగా మారాయని అభ్యర్థులు వాపోతున్నారు. ఈ అత్యధిక ఉష్ణోగ్రత వల్ల అనుకుననన స్థాయిలో ప్రచార షెడ్యూల్ పూర్తి చేయలేకపోతున్నామని దీనివల్ల ఎన్నికలకు ఎలాంటి ప్రభావం చూపదని తెలిపారు.

### భువనగిరి పార్లమెంట్ విషయానికి వస్తే...

భువనగిరి పార్లమెంట్ స్థానం కోసం మొత్తం 61 నామినేషన్ దాఖలు చేయగా 10 నామినేషన్ దాఖలు తిర్కసరణకు గురయ్యాయి. ప్రస్తుతం 51మంది బరిలో ఉన్నారు. ఇక ప్రధాన పార్టీలు బిజెపి కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటి ఏర్పడినుంది. ఈ ప్రధానన పార్టీ ప్రచారాలకు కూడా ప్రధాన నగరాలలో మండలాల్లో నియోజకవర్గాలలోనే నిర్వహించడం జరిగింది. దీంతో గ్రామాలలో ప్రచారాలకు సమయం కేటాయించపోవడం గమనించాల్సి న విషయం. అయితే అభ్యర్థులు ఎక్కువగా సోషల్ మీడియా పై ఆధారపడడం గమనార్హం. భువనగిరి గెలుపుపై అభ్యర్థులు ఎవరికి వారే దీమా వ్యక్తం చేస్తున్నా లోలోపల భయంగానే ఉన్నారు.

### ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

**జిల్లెడు చౌదరిగూడ, మే 04,(ప్రభాతవార్త):** చేనేత ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని భారతీయ జనతా పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ సుధాకర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని సుదర్శన్ పక్షన్‌హాల్‌లో ఆదివారం ఉదయం చేనేత ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పెర్కొన్నారు. ఈ కార్యక్రమానికి చేనేత కుల భాంధవులు తప్పని సరిత హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఫ్రీజ్ డబ్బులు బాధితులకు అందేలా చూడాలి

-న్యాయమూర్తికి సూచించిన జిల్లా ఎస్పి



న్యాయమూర్తి భవాని చంద్రని మర్యాద పూర్వకంగా కలుసుకున్న జిల్లా ఎస్పి రూపేష్ చెన్నూరి

**సంగారెడ్డి టౌన్, మే 4, ప్రభాతవార్త:**
సైబర్ నేరాలలో ఫ్రీజ్ అయిన డబ్బులను వెంటనే బాధితులకు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పి సిహెచ్ రూపేష్ చెన్నూరి ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జి భవాని చంద్రను కోరారు. శనివారం సంగారెడ్డిలో న్యాయమూర్తి కార్యాలయానికి జిల్లా ఎస్పి రూపేష్ చెన్నూరి చేరుకుని న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి భవాని చంద్ర మాట్లాడుతూ రానున్న జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా పోలీసు అధికారులు ప్రత్యేక చొరవ తీసకుని అధిక మొత్తంలో కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎస్పి సూచించారు.ఎస్పి వెంట డీసీఆర్బీ ఇన్స్‌పెక్టర్ రమేష్, కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ సత్యనారాయణలు ఉన్నారు.

## హనుమాన్ ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**నారాయణఖేడ్ టౌన్, మే 4, ప్రభాతవార్త:**
పట్టణంలోని 7, 15 వార్డులు, నెహ్రూ నగర్ కాలనీల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం బిఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జహీరాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ భారీ మెజార్టీలో పార్లమెంట్ మెట్లు ఎక్కేలా ఆశీర్వదించాలని పార్టీ నాయకులు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆమిర్ పరశురాం, పట్టణ అధ్యక్షులు నగేష్ గుప్తా, మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ బాసిత్, కౌన్సిలర్లు పుటాల విఠల్, సయనయద్ ముజామిల్, కో-ఆప్షన్ సభ్యులు ఉబేద్, లైక్, గోపాల్, దుర్గయ్య, నర్సింలు, శ్రీకాంత్, సతీష్, మచందర్, అంబదాస్, గుండన్న తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నేతలు



బిఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ ఖండువాలు కప్పి స్వాగతం పలుకుతున్న మాజీ ఎంపి సురేశ్‌షెట్కార్

**న్యాల్‌కల్, మే 4, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో పాటు మండలంలోని చీకుర్తి, రత్నాపూర్, మల్గి, కాకిజనవాడ, వడ్డి గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో (100 మంది) శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని చీకుర్తి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీలో చేరిన బిఆర్ఎస్ నేతలకు మాజీ ఎంపి, కాంగ్రెస్ ఎంపి అభ్యరి సురేశ్‌కుమార్ శెట్కార్ కాంగ్రెస్ ఖండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిఎస్ ఎఫ్‌డిసి చైర్మన్ గిరిధర్‌రెడ్డి, టిఎస్ ఐడిసి మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, న్యాల్‌కల్ సొసైటీ చైర్మన్ సిద్దిలింగయ్యస్వామి, మాజీ జడ్పీటిసి సభ్యులు బ్యాత చంద్రప్ప, నాయకులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, మహ్మద్ గౌసోద్దిన్, మహ్మద్ రఫియోద్దిన్, అజాం పటేల్, జనార్ధన్‌రెడ్డి, మున్ను పటేల్, రాజేష్, రాజప్ప, వడ్డ రవికుమార్, రామకృష్ణరెడ్డి, అనిల్‌రెడ్డి, రాములు, మునీరుద్దీన్, అజీమ్ మక్సుద్ అలీ షా, ముస్తఫా,అంజి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా శ్రావణ్



నియామకం పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

**బెజ్జంకి, మే 4, ప్రభాతవార్త :**
రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా మండల పరిధిలోని చీలాపూర్ గ్రామానికి చెందిన శానగొండ శ్రావణ్‌ను నియమించినట్లు రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు శివసేనారెడ్డి శనివారం తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర రవాణశాఖ మంత్రి ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనాయణ, రాష్ట్ర అధ్యక్షులు శివసేనరెడ్డి, పడాల రాహుల్, ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## సిఈఐఆర్ టెక్నాలజీతో బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్‌ను అందిస్తున్న ఎస్సై దామోదర్

**చేర్యాల,మే 4,ప్రభాతవార్త**
సిఈఐఆర్ టెక్నాలజీతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి చేర్యాల ఎస్సై దామోదర్ శనివారం అందించారు.చేర్యాల పట్టణానికి చెందిన భూమిగారి శివకుమార్ తన సమ్‌సాంగ్ సెల్‌ఫోనును తేది:27-04-2024 నాడు పోగొట్టుకోగా ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వెబ్‌సైట్లో ఫోన్‌కు సంబంధించిన ఐఎంఈఐ నెంబర్‌ను ఎంటర్ చేసి బ్లాక్ చేశాడు.దీంతో ఫోన్ దొరికిన వ్యక్తి దాంట్లో సిమ్‌కార్డు వేసుకోవడంతో సంబందిత వెబ్‌సైట్లో అతని వివరాలతో కూడిన సమాచారం చేర్యాల పోలీసులకు చేరింది.అతని నుండి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని,పోగొట్టుకున్న వ్యక్తికి సమాచారం అందించి ఎస్సై శనివారం బాధితుడికి అందించారు.

# బిజెపిలో చేరిన చెన్నరెడ్డిపల్లి గ్రామస్తులు

**నర్సాపూర్ మే, 4. ప్రభాతవార్త :**
నర్సాపూర్ మండల పరిధిలోని చెన్నరెడ్డిపల్లి (ఆద్మాపూర్) గ్రామస్తులు పలువురు బిజెపి పార్టీలో చేరారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్, బిజెపి మండల అద్యక్షులు నీలి నాగేశ్ ల అధ్వర్యంలో చెన్నరెడ్డిపల్లి (ఆద్మాపూర్) గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నుండి గ్రామానికి చెందిన జరుకుల శ్రీనివాస్, దేవసోత్ శ్రీనివాస్ లతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీకి రాజీనామ చేసి బిజెపి తీర్థం పుచ్చుకున్నారు.ఈమేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్, బిజెపి మండల అద్యక్షులు నీలి నాగేశ్ ల సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు.బిజెపి పార్టీలో చేరిన వారికి బిజెపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దేశ ప్రధాని నరేంద్రమోడి అధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలోబిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్, బిజెపి మండల అద్యక్షులు నీలి నాగేశ్‌లతో పాటు పట్టణ అద్యక్షులు ఆంజనేయులు గౌడ్,మండల ప్రదాన కార్యదర్శి సంజీవ్‌రెడ్డి,నాగేశ్‌గౌడ్,హన్మంతాపూర్ ఆంజనేయులు,దుర్గేశ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బిజెపి పార్టీలో చేరుతున్న వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్ తదితరులు

## భూత్ స్థాయి కార్యకర్తలకు శిక్షణ



నర్సాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో భూత్ స్థాయి కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆవుల రాజిరెడ్డి తదితరులు

**నర్సాపూర్ మే, 4. ప్రభాతవార్త :**
పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన పద్దతుల పై భూత్ స్థాయి కార్యకర్తలుకు అవగాహన కల్పించేందుకు గాను కాంగ్రెస్ పార్టీ భూత్ స్థాయి కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నర్సాపూర్ పట్టణంలోని సాయికృష్ణ గార్డెన్‌లో నిర్వహించారు ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రైనర్ సంతోష్ హాజరవ్వగా కాగ్రెస్ పార్టీ జిల్లా అద్యక్షులు ఆంజనేయులుగౌడ్,పిసిసి ప్రధాన కార్యదర్శి ,కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు సుహాసిని రెడ్డి, లు హాజరయ్యారు. ఈభూత్ స్థాయి కార్యకర్తల శిక్షణకు ట్రైనర్‌గా సంతోష్ వ్యవవహరించారు. ఈసందర్భంగా ట్రైనర్ సంతోష్, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి లు మాట్లాడుతూ...పార్లమెంట్ ఎన్నికల్లో భూత్ స్థాయి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈమేరకు బూత్ స్థాయి కార్యకర్తలు ఈ ఎనిక్రల్లో అనుసరించాల్సిన పద్దతులను పై వారికి దిశానిర్ధేశం చేశారు. ట్రైనర్ సంతోష్ భూత్ స్తాయి కార్యకర్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాగ్రెస్ పార్టీ జిల్లా అద్యక్షులు ఆంజనేయులుగౌడ్,పిసిసి ప్రధాన కార్యదర్శి,కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు సుహాసిని రెడ్డి లతో పాటు భూత్ స్థాయి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**గజ్వేల్ టౌన్, మే 4 (ప్రభాతవార్త):**
గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 15వ వార్షికోత్సవ వేడుకలను శనివారం పట్టణంలోని లక్ష్మణ్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ ఆచార్య వెల్దండి నిత్యానందరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణ, ఓర్పు, ఉదత్తత, సంయమనం, మంచి ఆలోచన విధానం ఉండాలని, మనిషిని మనిషిగా గుర్తించాలని, ధర్మంతో మెలగాలని వివరించారు. లక్ష్యం అనేది ఏర్పర్చుకున్నప్పుడే మనిషి తప్పు చేయదని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఉమాశశి మాట్లాడుతూ విద్యార్థినిలు కళాశాలలో గొప్ప ఉత్తీర్ణత శాతం సాధించారని, దీనికి కళాశాల అధ్యాపకుల కృషి ఎంతో ఉందని అభివర్ణించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గౌరవం ఇచ్చి తోటి స్నేహితులతో సంబంధాలు కలిగి ఉండాలని, కళాశాల ఉత్తీర్ణత పెంచి గౌరవాన్ని కాపాడాలని కోరారు. రిటైర్డు ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ సమస్యలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా ఆత్మస్థైర్యాన్ని పెంచుకోవాలని, మన విజ్ఞానాన్ని పాజిటీవ్‌గా ఉపయోగించాలని అన్నారు. ధర్మాన్ని రక్షిస్తే ఆ ధర్మమే మనల్ని కాపాడుతుందని వివరించారు. కాగా వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థినిలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నారు. అనంతరం టాపర్స్‌గా నిలిచిన విద్యార్థినిలకు సిపిడిసి సభ్యులు పరమేశ్వరచారి, మధుసూదన్, లక్ష్మణ్, డాక్టర్ శైలజ తదితరులు గోల్డ్ మెడల్స్‌ను అందజేయడం జరిగింది.

## 17 నుంచి మెథడిస్ట్ క్రైస్తవ జాతర ఉత్సవాలు

-జాతర కరపత్రం ఆవిష్కరణ



అల్లీపూర్‌లో జారత కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డిఎస్ జాన్ వెస్లీ

**జహీరాబాద్, మే 4, ప్రభాతవార్త:** ఈ నెల 17వ తారీఖు నుంచి అల్లీపూరన మెథడిస్ట్ క్రైస్తవ జాతర ఉత్సవాలు 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డిస్ జాన్ వెస్లీ, లే లీడర్లు డాక్టరన సరేన్ జాన్, రెవరెండ్ రవికుమార్‌లు తెలిపారు. శనివారం అల్లిపూర్ మెథడిస్ట్ సెంట్రల్ చర్చి ఆవరణలో జాతర కరపత్రాన్ని ఆవిష్కరించారు. జాతర ఉత్సవాలకు ముఖ్య అతిథిగా బిషప్ డానియల్ ఆవా డానియల్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావులతో పాటు క్రైస్తవ మత పెద్దలు లే లీడర్లు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో అనంత నవిన్ కుమార్, రాష్ట్ర లే లీడర్ ఇమ్మానియేల్, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ దీక్షకు తరలిన కాంగ్రెస్ నేతలు



రాజ్యాంగ పరిరక్షణ దీక్షకు తరలివెళ్లిన కాంగ్రెస్ ఆయకులు

**జహీరాబాద్, మే 4, ప్రభాతవార్త:**
భారత రాజ్యాంగాన్ని రక్షించాలంటూ హైద్రాబాద్‌లో మాజీ మంత్రి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ దీక్షకు జహీరాబాద్ నియోజకవర్గం నుంచి ఎస్సీ నాయకులు పెద్ద సంఖ్యలో శనివారం తరలివెళ్లారు. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయనున్న నేపద్యంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ దీక్ష చేపట్టినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు కే భీమయ్య, న్యాయవాది గోపాల్ తదితరులు ఉన్నారు.

## బైక్ మెకానిక్‌కు రూ.10వేల జరిమానా



బైక్ మెకానిక్‌కు మొక్కను అందజేస్తున్న మున్సిపల్ అధికారులు

**గజ్వేల్, మే 4 (ప్రభాతవార్త):**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లోని ఒక బైక్ మెకానిక్ షాపు యజమాని తన షాపు ముందు ఉన్న చెట్టు వద్ద మంట పెట్టడంతో చెట్టు మొదలు కాలిపోవడం జరిగింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు శనివారం బైక్ మెకానిక్‌కు రూ.10వేల జరిమానా విధించడంతో పాటు ఆ ప్రాంతంలో మరో మొక్కను నాటించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఎవరైనా అనుమతి లేకుండా చెట్లను నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ

**జగదేవ్‌పూర్, మే 4 (ప్రభాతవార్త):**
జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తీగుల్ గ్రామానికి చెందిన కందుకూరి వెంకటేష్ రోడ్డు ప్రమాదం మృతిచెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి శనివారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుని కుటుంబ సభ్యులకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బట్టు సుధాకర్‌రెడ్డి, జగదేవ్‌పూర్ పిఎసిఎస్ డైరెక్టర్ కామల్ల భూమయ్య, సీనియర్ నాయకులు దయానందరెడ్డి, కోటయ్య, శ్రీరామ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన ఉమేష్ యాదవ్



తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఉమేష్‌యాదవ్

**గజ్వేల్ టౌన్, మే 4 (ప్రభాతవార్త):**
జాతీయ బిసి సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము ఉమేష్ యాదవ్ బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉమేష్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌ల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రాష్ట్రంలో బిసి కుల గణనకు ఏర్పాట్లు చేయడం సంతోషకర విషయం అన్నారు. అదేవిధంగా బిసి కులగణనకు ఏర్పాట్లు చేయడం, వాటికి నిధులు మంజూరు చేయడం ఆహ్వానించదగిన పరిణామమన్నారు. అన్ని పార్టీలు అగ్రవర్ణాల గురించి ఆలోచిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ బిసిల గురించి ఆలోచించి ఎలాంటి రాజకీయ వారసత్వంలేని ఒక పేదింటి బిసి బిడ్డ నీలం మధుకు మెదక్ ఎంపి టికెట్ కేటాయించడంతో తాను కాంగ్రెస్‌లో చేరడం జరిగిందని అన్నారు.

## ఆసుపత్రిని పరిశీలించిన డిసిహెచ్ఎస్



కరస్‌గుత్తిలో ఆసుపత్రిని పరిశీలిస్తున్న డిసిహెచ్ఎస్ సంగారెడ్డి

**నాగల్‌గిద్ద, మే 4, ప్రభాతవార్త:**
మండలంలోని కరస్‌గుత్తి గ్రామంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డిసిహెచ్ఎస్ సంగారెడ్డి పరిశీలించారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసున్నారు. ఆసుపత్రికి చేరుకున్న రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరిండెంట్ అనురాధ, డాక్టర ఏప్న, పార్మసిస్ట్ గిరి, సూపర్‌వైజర్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్నస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

**సిర్గాపూర్, మే 4, ప్రభాతవార్త:**
మండలంలోని చీమల్ పాడ్‌లో కొనసాగుతున్న శ్రీ మల్లన్నస్వామి జాతర ఉత్సవాల్లో శనివారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే జాతర ఉత్సవ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు రాఘవరెడ్డి, ఎంపిపి మహిపాల్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు సంజీవ్‌రావు పాటిల్, ఎంపిపి ఉపాధ్యక్షులు మాధవరావు పాటిల్, గ్రామ మాజీ సర్పంచ్ బసిరెడ్డి, నాయకులు బసవరాజ్, సంతోష్, నాగిశెట్టి తదతరులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన మాజీ సర్పంచ్

**నాగల్‌గిద్ద, మే 4, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గొందిగామ గ్రామ మాజీ సర్పంచ్ శంకరమ్మ రాజప్ప శనివారంభారతీయ జనతా పార్టీలో చేరారు. జహీరాబాద్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి బిబి పాటిల్ సమక్షంలో బిజెపిలో చేరిన మాజీ సర్పంచ్‌కు బిబి పాటిల్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు నాగిశెట్టి పాటిల్, గంగారం, మల్లికార్జున్, మహేష్, నగేష్, సంతోష్ పాల్గొన్నారు.



బిజెపిలో చేరుతున్న మాజీ సర్పంచ్

## అంగన్‌వాడీ కేంద్రంలో శ్రీమంతం, అన్నప్రాసన



అంగన్‌వాడీ కేంద్రంలో శ్రీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

**గజ్వేల్ టౌన్, మే 4 (ప్రభాతవార్త):**
గజ్వేల్ పట్టణ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ లక్ష్మాపూర్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ టీచర్ ప్రశాంత ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలతోనే సంపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందని, ఆకుకూరలు, కూరగాయలు, మునగ, బీట్‌రూట్ తీసుకుంటే రక్తహీనత ఉన్న వారికి మంచిదన్నారు. గర్భిణీ స్త్రీలు ఆరోగ్యకరమైన సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు నీల, సుజాత, ఆశా వర్కర్ భాగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో ఉచిత అంబలి కేంద్రం ఏర్పాటు

**నర్సాపూర్ మే, 4. ప్రభాతవార్త :**
నర్సాపూర్ పట్టణానికి చెందిన నాగరాజుగౌడ్ తన తల్లిదండ్రులైన కమలమ్మ వెంకటస్వామిగౌడ్ లజ్ఞాపకార్థం నర్సాపూర్ బసాండ్ ప్రాంతంలోఉచిత అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది,.ఈ మేరకు ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా ఈఅంబలి కేంద్రాన్ని ప్రారంబించారు.నర్సాపూర్ పట్టణంలో జరిగే ప్రతి సంత రోజున ఈ అంబలి కేంద్రం నిర్వహించబడుతుందని తెలిపారు.మండల పరిధిలోని గ్రామాల ప్రజలు సంతరోజు నర్సాపూర్‌నకు వస్తుంటారు ఈ మేరకు వారు ఎండవేడిమికి తట్టుకోలేక పోతారని వారికి సేద తీర్చడానికి ఈ ఉచిత అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు నాగరాజుగౌడ్ తెలిపారు. ఈమేరకుఈ ఉచిత అంబలి కేంద్రాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## కాంగ్రెస్‌లో చేరిన ముక్తాపూర్ బిఆర్ఎస్ నేతలు



ముక్తాపూర్‌లో కాంగ్రెస్‌లో చేరుతున్న బిఆర్ఎస్ నాయకులు

**నాగల్‌గిద్ద, మే 4, ప్రభాతవార్త:** మండలంలోని ముక్తాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నేతలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ తాజా మాజీ సర్పంచ్ జగదీశ్ తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నేతలకు డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్ శెట్కార్‌లు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, నాయకులు హన్మంతరావు పాటిల్, గుండేరావు, విఠల్‌రావు, అంజిరెడ్డి, సంజీవ్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, మే 4 (ప్రభాతవార్త):**
మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన కోనమైన ఎల్లయ్య అకాల మరణం చెందగా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ బిసిసెల్ మండల అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్ శనివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబసభ్యులకు రూ.4వేల ఆర్థిక సహాయం అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నర్సింలు, కృష్ణ, ప్రభాకర్ ఉన్నారు.

## తల్లిదండ్రులకు కడుపుకోత కలిగించవద్దు : వంటేరు ప్రతాప్‌రెడ్డి

**వర్గల్, మే 4 (ప్రభాతవార్త):** యువతీ, యువకులు ఏ సమస్య ఉన్నా కుటుంబ సభ్యులకు చెప్పి పరిష్కరించుకోవాలి తప్ప ఆత్మహత్యలకు పాల్పడి తల్లిదండ్రులకు కడుపుకోత కలిగించవద్దని మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. వర్గల్ మండలం వేలూరు గ్రామానికి చెందిన రాయల మౌనిక(20) ఆత్మహత్య చేసుకోగా విషయం తెలుసుకున్న ప్రతాప్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ప్రతాప్‌రెడ్డి వెంట గ్రామ మాజీ సర్పంచ్ పాపిరెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

## నేటి దళిత సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

-బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ ప్రధాన కార్యదర్శి కొండాపురం జగన్



విలేకరులతో మాట్లాడుతన్న బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ ప్రధాన కార్యదర్శి కొండాపురం జగన్

**మెదక్ మున్సిపాలిటీ, మే4 ప్రభాతవార్త:**
మెదక్ పట్టణంలోని మాయా గార్డెన్‌లో ఈ నెల 5వ తేదీన సాయంత్రం 5.00 గంటలకు నిర్వహించే మెదక్ పార్లమెంట్ స్థాయి దళితన సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ ప్రధాన కార్యదర్శి కొండాపురం జగన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొల్లార్ (కర్ణాటక) ఎంపీ మునిస్వామి, పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు, పార్లమెంట్ కోఆర్డినేటర్ కొప్పు భాషాలు విచ్చేస్తున్నారని తెలిపారు. కావున దళితులు, దళిత మేధావులు, దళిత నాయకులు, యువకులు పెద్దఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, మెదక్ పార్లమెంట్ ఎస్సీ మోర్చా ఇంచార్జి మంకిడి స్వామి, మెదక్ జిల్లా దళిత మోర్చా అధ్యక్షులు యాదగిరి, దళిత మోర్చా నాయకులు వరప్రసాద్, సురేష్, నత్తి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా వడదెబ్బ నివారణ క్యాంపులు



వడ దెబ్బ నిరవాణ మందు పంపిణీ చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, మే 4, ప్రభాతవార్త :**
అలయన్స్ సిద్దిపేట జిల్లా గవర్నర్ చకిలం బాలచంద్రం అధ్వర్యంలో స్నేహ క్లబ్, ఝూన్సీక్లబ్ నిర్వహణలో శనివారం వడదెబ్బ నివారణ మెగా క్యాంపు నిర్వహించారు. గాంధీ చౌరస్తా, వెంకటేశ్వర స్వామి దేదాలయం అవరణ, పాత బస్టాండు ప్రాంతంలో హోమియోపతి సంబంధించిన వడదెబ్బ నివారణ చుక్కల మందు పంపిణీ చేశారు. సుమారు 2 వేల మందికి పైగా వడదెబ్బ నివారణ చుక్కల మందు వేశారు. అలాగే భారత్‌నగర్, శుభోదయ స్కూల్ వద్ద మజ్జిగ వితరణ కేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేయడం జరుగుతుందని నిర్వహకులు తెలిపారు. సేవ కార్యక్రమాలు చేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో స్నేహ క్లబ్ అధ్యక్షులు సూర్యం, ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ అత్మ రాములు, సౌత్ మల్టిపుల్ పిఆర్ఓ ఫాస్ట్ గవర్నర్ సోమ వనజ, వైస్ గవర్నర్లు సోమ శివకుమార్, జడ్‌సి మద్ది మల్లేశం, మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.